క్లుప్తంగా

వైద్యసేవల్లో నిర్లక్ష్యం తగదు



వీపనగండ్ల: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శించరాదని మండల వైద్యాధికారి వంశీకృష్ణ ఆశాకార్యకర్తలకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో ఆశాకార్యకర్తలతో ప్రత్యేక సమవేశం నిర్వహించారు. గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను శుభ్రపరుచుకోవడంలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. స్వచ్ఛమైన తాగునీటిని తాగడం వల్ల రోగాల బారిన పడకుండా ఉండవచ్చన్న విషయాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. గ్రామీణ ప్రజలు అత్యవసర సమయంలో ప్రభుత్వ ఆస్పత్రి నుంచి వైద్య సేవలు అందుకునే విధంగా ఆశాకార్యకర్తలు కృషి చేయాలని అన్నారు.

అధిక కమీషన్ వసూలు సరికాదు



వనపర్తి: జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో చోటు చేసుకుంటున్న అధిక కమీషన్ వసూళ్లపై కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని కిసాన్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం మార్కెట్ యార్డును కిసాన్ కాంగ్రెస్ బృందం సందర్శించి కొనుగోళ్లపై ఆరా తీయగా.. తక్‌పట్టీలు లేకుండానే కొనుగోళ్లు చేస్తున్న విషయాన్ని గుర్తించామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షాన నిలువగా వనపర్తి మార్కెట్‌లో రైతులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. కమీషన్ ఏజెంట్లు నిబంధనలకు విరుద్ధంగా బుక్కచిట్టీలపై లావాదేవీలు నిర్వహిస్తూ.. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ నాయకులు మన్యం, రామేశ్వర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, పెంటన్నయాదవ్, సుదర్శన్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ రామ్‌లాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలోని స్థానిక ఉన్నత పాఠశాలలో సీపీఎస్ (టీఎస్) ఉద్యోగుల నూతన సంవత్సర క్యాలెండర్ సోమవారం ఎంఈఓ జయరాం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దొడ్ల దయానంద్, ప్రధాన కార్యదర్శి చిన్నస్వామి, ఓపీఎస్ ఉద్యోగులు విష్ణువర్ధన్‌రావు, వరప్రసాదరావు, సీపీఎస్ ఉద్యోగులు శ్రీనివాస్‌గౌడ్, విష్ణువర్ధన్‌నాయుడు, తిమ్మప్ప, నాగేంద్రం, తదితరులు పాల్గొన్నారు.

పోషమ్మ ఉత్సవాలు



ఖిల్లాఘనపురం: మండలంలోని హీర్లతండాలో సోమవారం పోషమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి అమ్మవారి పూజలకు సంబంధించిన కార్యక్రమాలను చేపట్టిన గిరిజనులు రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఒక్కరి ఇంటి ఎదుట ధాన్యం బస్తాలు, బంతి పూలతో పాటుగా పలురకాల పూలు, పండ్లు తదితర వాటితో మండపాన్ని ఏర్పాటు చేసిన గిరిజనులు అమ్మవారిని మండపంలో ప్రతిష్ఠించి పూజలు చేశారు. అమ్మవారికి పొటేళ్లను బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. పండుగ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గిరిజన పాటలకు నృత్యాలు చేశారు. బంధువులు, చుట్టు గ్రామాల ప్రజల రాకతో తండాలో పండుగ వాతావరణం ఏర్పడింది.

నులి పురుగుల నివారణపై అవగాహన

ఆత్మకూర్: జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆత్మకూర్, అమరచింత మండలాల హెచ్‌ఎంలకు, ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల అధ్యాపకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి డాక్టర్ శరత్‌కుమార్ మాట్లాడుతూ ఫిబ్రవరి 12న, 19న ఆల్బెండజోల్ మాత్రలు ఒక ఏడాది వయస్సు నుంచి 19 ఏళ్ల వరకు విద్యార్థులకు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంఈఓ భాస్కర్‌సింగ్, సీహెచ్ఓ సురేష్‌కుమార్, హెల్త్‌సూపర్‌వైజర్ సామ్రాజ్యలక్ష్మి, సురేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పెండింగ్ బిల్లులపై ఆందోళన

- సర్వసభ్య సమావేశంలో అసహనం వ్యక్తం చేసిన సర్పంచ్‌లు
- తాగునీటి సమస్యకు పరిష్కారం కరువు



మాట్లాడుతున్న ఎంపీపీ కమలేశ్వర్‌రావు

వీపనగండ్ల: ప్రజా అవసరాల కోసం గ్రామాల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు సకాలంలో రాకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురయ్యామని సర్పంచ్‌లు ఆవేదనను వ్యక్తం చేశారు. సోమవారం ఎంపీపీ కమలేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామంలో నిర్మించిన ఈజీఎస్ దిమ్మెలకు నేటికీ బిల్లులు చెల్లించలేదని సంపత్‌రావుపల్లి సర్పంచ్ రామేశ్వర్‌రావు వాపోయారు. మొక్కల నిర్వహణ కోసం చెల్లించాల్సిన డబ్బులు సకాలంలో రాకపోవడంతో ఇబ్బందులకు గురయ్యామన్నారు. పలు గ్రామాల్లో పాడైన కరెంటు స్తంభాలకు ఎస్టిమేషన్ పంపించినా.. అవసరమైన స్తంభాలు అందించలేదని సంగినేనిపల్లి సర్పంచ్ మౌలాలీ, గోపల్‌దిన్నె సర్పంచ్ విజయ్‌కుమార్, బొల్లారం సర్పంచ్ పద్మ అధికారుల దృష్టికి తెచ్చారు. సంపత్‌రావుపల్లిలోని ఎస్సీ కాలనీలో భగీరథ పైప్‌లైన్ వేయకపోవడతో కాలనీవాసులకు తాగునీరు అందడం లేదని సర్పంచ్ ఆవేదన చెందారు.

అందుబాటులో లేని గడ్డి విత్తనాలు

గడ్డి విత్తనాలు రాకపోవడం వల్ల రైతులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని కల్వరాల సర్పంచ్ రఘునాథ్‌రెడ్డి సభ దృష్టికి తెచ్చారు. ఆర్భాటంగా తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను చేయించారు కానీ ఖర్చు చేసిన డబ్బులు తిరిగి చెల్లించలేదని వల్లభాపురం సర్పంచ్ రావుల రవీందర్‌రెడ్డి మండిపడ్డారు. తమ గ్రామం నుంచి మూడు కిలోమీటర్లు వెళ్లి రేషన్ బియ్యం తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని, కొత్త రేషన్ షాపును ఏర్పాటు చేయాలని వల్లభాపురం తండా సర్పంచ్ అంజయ్యనాయక్ అధికారులకు విన్నవించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కతలప్ప, తహసీల్దార్ వరలక్ష్మి, సింగిల్‌విండో చైర్మన్ రామన్‌గౌడ్, వ్యవసాయాధికారి డాకేశ్వర్‌గౌడ్, మండల విద్యాధికారి లక్ష్మణ్‌నాయక్, ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మమ్మ, విద్యుత్ ఏఈ భగవంత్ నాయక్, ఏపీఎం బిచ్చన్న, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ సత్యం, మండల వైద్యాధికారి వంశీకృష్ణ, ఏఈలు ప్రభు, కృష్ణ, ధానయ్య, మెహర్ తేజ, ఫారెస్టు అధికారిణి రాణి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు న్యాయం చేసే వరకు పోరాటం

పెబ్బేరు రూరల్: దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 16న తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మిక ఫెడరేషన్ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో నిర్వహించే సమ్మె నోటీసును కార్మికులు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా నిర్వహించే గ్రామీణ భారత్ బంద్‌లో రాష్ట్రంలోని అన్ని రంగాల ఉద్యోగులు, కార్మికులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్మికుల న్యాయమైన 21 డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఇసుక, ఇటుక, కంకర, స్టీల్ పాయింట్ తదితర ముడి సరుకుల ధరలను నియంత్రించడంతో పాటు అసెంబ్లీ సమావేశంలో గత ప్రభుత్వం ప్రకటించిన లక్ష మోటారు సైకిళ్లను కార్మికులకు అందించాలని కోరారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గంధం మదన్, జిల్లా ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నిక్సన్, జిల్లా నాయకులు రాబర్ట్, పుల్లయ్య, కురుమయ్య, మన్యం, రత్నయ్య, బాలరాజు, మన్యం పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సు ఉద్యోగాలకు ఎంపిక

పాన్‌గల్: రాష్ట్రంలో ఆదివారం వెలువడిన స్టాఫ్ నర్సు ఉద్యోగాల ఫలితాలల్లో పాన్‌గల్ మండలం నుంచి 11 మంది ఎంపికయ్యారు. అన్నారం నుంచి సత్యాక్రాంతి, జయశ్రీ మాధరావుపల్లి నుంచి రేష్మ, శ్రీవాణి, అన్నారంతండా నుంచి లోక్యానాయక్, చింతకుంట నుంచి రాజేశ్వరీ, దావాత్‌ఖాన్‌పల్లి నుంచి ప్రకాష్, జమ్మాపూర్ నుంచి రవీందర్, రాయినిపల్లి నుంచి సరిత, కదిరెపాడు నుంచి సత్యానారాయణ, మాందాపూర్ నుంచి శివగోవిందమ్మ ఉద్యోగాలు సాధించారు. స్థానికులు వారిని అభినందించారు.

వీపనగండ్ల: స్టాఫ్‌నర్స్ ఉద్యోగ ఫలితాల్లో మండలంలో ఆరుగురికి ఉద్యోగాలు రావడంపై మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. కల్వరాలకు చెందిన పోచమోని హరికృష్ణ, చింతా శోభలత, ఎరుకలి కుర్మయ్య, వీపనగండ్లకు చెందిన బరిగెల కవిత, దయ్యపు ప్రసన్న, సువార్త ఉద్యోగాలను సాధించారు.

ఒకే కాలనీలో 10మందికి..

కొత్తకోట రూరల్: తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ నిర్వహించిన నర్సు పరీక్ష ఫలితాల్లో కొత్తకోటలోని ఎస్సీ కాలనీకి చెందిన 10మంది మహిళలు వైద్య శాఖలో ఉద్యోగాలు సాధించారు. కాలనీకి చెందిన గుడిసె కళ్యాణి, నారమన్ శ్రావణి, జనంపల్లి మౌనిక, కొమ్ము దీప్తి, సత్యరపు కవిత, బండారు సరిత, కొమ్ము అమల, మంద కీర్తి, జనంపల్లి మెర్సీ, సలోమి ఉద్యోగాలు సాధించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లదే కీలకపాత్ర



మదనాపురంలో ఉప సర్పంచ్‌లను సన్మానిస్తున్న జెడ్పీటీసీ కృష్ణయ్య

వీపనగండ్ల: గ్రామాల్లో పచ్చదనం పెరగడానికి సర్పంచ్‌లు కీలకపాత్ర పోషించారని ఎంపీపీ కమలేశ్వర్‌రావు అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని 14 మంది సర్పంచ్‌లను ఆయన శాలువా, మెమొంటోలతో సన్మానించారు. కరోనా సమయంలో ప్రజలను అప్రమత్తం చేయడంలో సర్పంచులు బాధ్యతాయుతంగా పనిచేశారని కొనియాడారు. శాశ్వత తాగునీటి వసతులు, క్రీడాప్రాంగణాలు, శ్మశానవాటికల ఏర్పాటులో స్థలాలు గుర్తింపులో సర్పంచులు ముందుండి పనులు పూర్తయ్యేలా చూశారని, పదవి విరమణ పొందినా సర్పంచ్‌లు చేసిన పనులు శాశ్వతంగా గుర్తుంటాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాధురి కిరణ్‌గౌడ్, తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీఓ కతలప్ప, ఎంపీఓ శ్రీనివాసరావు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, రాము, సర్పంచ్‌లు విజయ్‌కుమార్, రవీందర్‌రెడ్డి, రాణి, రఘునాథ్‌రెడ్డి, రమేశ్వర్‌రావు, మౌలాలి, చంద్రకళ, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.



వీపనగండ్లలో..

మదనాపురం: గ్రామాల అభివృద్ధి కోసం గత ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ నాయకులను ప్రజాప్రతినిధులుగా గెలిపించారని జెడ్పీటీసీ కృష్ణయ్యయాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయా గ్రామాల ఉప సర్పంచ్‌లను వారు సన్మానించారు. ప్రజలకు అందుబాటులో ఉండి స్థానిక సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో అభివృద్ధి పనులు భాగమయ్యారని కొనియాడారు. కార్యక్రమంలో వెంకట్‌నారాయణ, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు కురుమూర్తి, ఆవుల బాలకృష్ణ, మనోజ్ కుమార్, రహీం, ఉప సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు మనివర్ధన్, ఉప సర్పంచులు రఘునాథ్‌రెడ్డి, బుచ్చమ్మ, నరసింహాచారి, అనిత, పావని, పద్మ పాల్గొన్నారు.

60 వరి ధాన్యం బస్తాల చోరీ

చిన్నంబావి: మండలంలోని మియాపూర్ గ్రామానికి చెందిన ఓడే రాధాకృష్ణకు చెందిన 35 బస్తాలు, రాజుకు చెందిన 15 బస్తాలు, ఓడే శ్రీశైలం కు చెందిన 15 బస్తాల ధాన్యాన్ని కల్లంలో ఆరబెట్టారు. రాత్రి సమయం కావడంతో ఇంటికి వెళ్లిపడుకున్నారు. సోమవారం ఉదయం వచ్చి చూడగా ముగ్గురు బాధితులకు చెందిన 65 బస్తాల ధాన్యం చోరీకి గురయ్యిందని రైతులు వాపోయారు. ఈ విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇటీవల కాలంలో మండలంలోని పలు గ్రామాల్లో వరుసగా దొంగతనాలు జరుగుతున్నా ఇప్పటి వరకు పోలీసులు ఒక్క కేసు చేధించకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు వాపోతున్నారు. 25వ తేదీన మండలంలోని బెక్కం గ్రామంలో బోయ గోపాల్‌కు చెందిన 46 బస్తాలు కూడా ఇదే రీతితలో చోరీకి గురయ్యాయి. 5వ తేదీన పెద్దదగడ గ్రామానికి చెందిన బోయ వీరయ్యకు చెందిన 36 బస్తాలు చోరీకి గురయ్యాయి. ఇలా వరుస దొంగతనాలు జరుగుతుండటంతో కేసు చేధించడంలో దొంగలు పోలీసులకు సవాల్ విసురుతున్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ సేనాపతి

గోపాల్‌పేట: ప్రజలకు సమస్యలు రాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని రేవల్లి ఎంపీపీ సేనాపతి అన్నారు. సోమవారం ఎంపీపీ సేనాపతి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇప్పటి వరకు సర్పంచ్‌లు అందుబాటులో ఉండి అన్ని సమస్యలు పరిష్కరించారని, ఇంకో మూడు రోజుల్లో సర్పంచుల పదవీకాలం ముగుస్తున్నందున అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు వెంటనే పరిష్కరించాలని సూచించారు. అంతకుముందు అన్ని శాఖల అధికారులు మూడు నెలలలో సాధించిన పురోగతిని సభకు వివరించారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నామని ఏఈ మొగులయ్య తెలిపారు. విద్యుత్ శాఖ తరపున ఏఈ శ్రీశైలం మాట్లాడుతూ మూడు నెలల్లో మండలంలో స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు పంపిణీని సభకు వివరించారు. సభ అనంతరం సర్పంచులను అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రఘు, జెడ్పీటీసీ సభ్యుడు భీమయ్య, ఎంపీడీఓ సుజాత, తహసీల్దార్ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు మార్చండి

అమరచింత: పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న డంపింగ్ యార్డ్‌ను మార్చలంటూ 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది మున్సిపల్ కమిషనర్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు వినోద్ మాట్లాడుతూ డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్న చెత్తను నిత్యం తగలబెట్టడం ద్వారా వస్తున్న పొగతో సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహించలేక పోతున్నామని వాపోయారు. అంతే కాకుండా కుళ్లిన వ్యర్థ పదార్థాలు, కోళ్ల వ్యర్థాలు, మృతి చెందిన జంతువుల కళేబరాలను తీసుకొచ్చి వాటిలో పారబోస్తుండడంతో దుర్గంధం వస్తుందని తెలిపారు. దీంతో నిత్యం దుర్వాసనతో పాటు పొగతో సావాసం చేస్తూ రోగాల బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డ్‌కు సమీపంలో చేనేత ఉత్పత్తుల సంఘం ఉందని, అక్కడి కార్మికులు సైతం వీటిని తరలించాలని ఎన్నో పర్యాయాలు వినతులు ఇచ్చారన్నారు. అధికారులు స్పందించి త్వరగా డంపింగ్ యార్డ్‌ను తరలించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ మహ్మద్ ఖాజా మాట్లాడుతూ డంపింగ్ యార్డును తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

ఫీజురీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయండి



మాట్లాడుతున్న ఆది

అమరచింత: ఆరేళ్ల నుంచి రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.7,200 కోట్ల స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేసి, విద్యార్థుల ఇబ్బందులను తొలగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆది డిమాండ్ చేశారు. విద్యార్థుల ఫీజు రియంబర్స్ మెంట్ కోసం ఎన్నో పర్యాయాలు ఉద్యమాలు చేసిన గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. 14 లక్షల మంది విద్యార్థులు తమ ఫీజులు రాక చదువులకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలని, ఖాళీగా ఉన్న 26 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. కొత్త జిల్లాలతో పాటు కొత్తగా ఏర్పడిన మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కాలేజీలను ఏర్పాటు చేయాలని, అమరచింత మండలంలో ఎన్నో పర్యాయాలు జూనియర్ కాలేజీ కోసం వినతులు ఇస్తున్నా గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో రాఘవ, రమేష్, చందు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

ఆత్మకూర్: ద్విచక్ర వాహనం అదుపు తప్పి గాయపడిన వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ నరేందర్, ఏఎస్ఐ బీచుపల్లి సోమవారం తెలిపారు. ఈ నెల 23వ తేదీన మండలంలోని గుంటిపల్లికి చెందిన అంజలమ్మ(64) ఆత్మకూర్ నుంచి బైక్‌పై వెంకటన్న, పద్మలతో కలిసి స్వగ్రామానికి వెళ్తుండగా పందిని ఢీకొని కిందపడ్డారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అంజలమ్మను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేసి, మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. సోమవారం తెల్లవారుజామున చికిత్స పొందుతూ మృతి చెందిందని, కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కేసు నమోదు చేయాలి



బేస్మెంట్‌ను పరిశీలిస్తున్న నాయకులు

పెబ్బేరు రూరల్: దివ్యాంగురాలైన లక్ష్మి ఇంటి బేస్మెంట్ కూల్చిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలని రాష్ట్ర దివ్యాంగుల సమాఖ్య కార్యదర్శి అడివయ్య, సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ మీసాల మోహన్ కోరారు. ఈ మేరకు వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వనపర్తి పట్టణంలోని పీర్లగుట్టలో లక్ష్మి ఇంటి బేస్మెంట్ ధ్వంసం చేసిన స్థలాన్ని ఎన్పీఆర్డీ ప్రతినిధి బృందం సోమవారం పరిశీలించింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సర్వే నంబర్ 974లో 110 గజాల ఇంటి స్థలం మంజూరు చేసింది. ఇంటి నిర్మాణం కోసం బేస్మెంట్ నిర్మించగా.. ఎవరూ లేని సమయంలో రామారావు బేస్మెంట్‌ను ధ్వంసం చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రభుస్వామి, శ్యాంసుందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు చెన్నయ్య, లక్ష్మి, జ్యోతి, నాగేంద్రమ్మ, రాధిక, మైసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపించాలి



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

గోపాల్‌పేట: అందరూ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రయత్నించాలని డాక్టర్ అంజలి సూచించారు. సోమవారం ఆమె సిబ్బందితో కలిసి రేవల్లి మండలంలోని తల్పునూరు పల్లె దవాఖానలో రోగులకు చికిత్స అందించారు. ఈసందర్భంగా 105 మంది గ్రామస్తులకు టీబీ, బీపీ, షుగర్ పరీక్షలు చేయగా 58 మందికి హైపర్ టెన్షన్, 46 మందికి డయాబెటిస్ గుర్తించి వారికి నెలకు సరిపడా మందులు ఇచ్చామని తెలిపారు. క్షయ వ్యాధి అనుమానితులు ఐదుగురు నుంచి శాంపిల్ సేకరించి గోపాల్‌పేట ఆస్పత్రికి పంపారు. 100 మందికి ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్లను ఆన్‌లైన్‌లో నమోదు చేశామని డాక్టర్ అంజలి చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ మధుబాబు, ఏఎన్ఎం అనురాధ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



మాట్లాడుతున్న ఎంఈఓ జయశంకర్

కొత్తకోట రూరల్: మండలంలోని అన్ని జెడ్పీహెచ్ స్కూళ్లలో 10వ తరగతి ఫలితాలను వంద శాతం తీసుకొచ్చేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని పెద్దమందడి మండల విద్యాధికారి జయశంకర్ అన్నారు. మండల వనరుల కేంద్రం, పెద్దమందడిలో మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సోమవారం క్లస్టర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రాం నిర్వహణ, ప్రాథమికోన్నత స్థాయిలో ఉన్నతి, విద్యార్థుల ప్రగతి, రోజు వారి హాజరు పెంచడంతో పాటు ప్రతి రోజు ఒక పిరియడ్‌ను కేటాయించి లైబ్రరీలోని పుస్తకాలను విధిగా చదివించాలన్నారు. తరగతి వారీగా ఉపాధ్యాయులందరూ విద్యార్థులకు తప్పని సరిగా పిరియడ్ కేటాయించి రీడింగ్ చేయించాలన్నారు. విద్యార్థుల సామర్థ్యాలను పెంచుటకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని, మంచి ఫలితాలను సాధించి జిల్లాలో మండలాన్ని ప్రథమ స్థానంలో ఉంచుదామని దిశా నిర్దేశం చేశారు. అంతకు ముందు జగత్‌పల్లి జెడ్పీహెచ్‌లోని 10వ తరగతి విద్యార్థులతో ఎంఈఓ మాట్లాడుతూ ప్రస్తుతం యాక్షన్ ప్లాన్‌లో భాగంగా జరుగుతున్న రోజువారీ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి రోజు ఉదయం ఒక సబ్జెక్ట్, మధ్యాహ్నం ఒక సబ్జెక్ట్ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు మంజులత, గోపినాథ్, నోడల్ అధికారి ఈశ్వరచారి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభిస్తున్న సర్పంచ్, అధికారులు

పాన్‌గల్: 25 కేవీవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభంతో తాగునీటి సమస్య పరిష్కారం అయిందని తెల్లరాళ్లపల్లితండా సర్పంచ్ శాంతమ్మ అన్నారు. సోమవారం తండాలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయకపోవడంతో మిషన్ భగీరథ తాగునీటి ట్యాంక్ నీటి సరఫరాకు అంతరాయం ఉండేదని ఆమె పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుపై మిషన్ భగీరథ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన అధికారులు 25 కేవీవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించడంతో ఎన్నో ఏళ్లుగా ఇబ్బందిగా ఉన్న తాగునీటి సమస్యకు పరిష్కారం లభించిందని ఆమె పేర్కొన్నారు. తండా తరపున ట్రాన్స్‌కో, మిషన్ భగీరథ అధికారులకు సర్పంచ్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మీకుమార్, విద్యుత్ ఏఈ చందన్‌కుమార్, లైన్‌మెన్ వెంకటస్వామి, పంచాయతీ కార్యదర్శి నర్మద, గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్ పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో సీనియర్ కరాటే మాస్టర్లు

కొత్తకోట రూరల్: హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఈనెల 27, 28న నిర్వహించిన 2వ అంతర్జాతీయ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో కొత్తకోటలోని గాడ్స్ ఆన్ వారియర్స్ షోటోఖాన్ కరాటే అకాడమీకి చెందిన 30మంది విద్యార్థులు ప్రతిభ కనబర్చి సర్టిఫికెట్లతో పాటు బంగారు, వెండి పతకాలు సాధించినట్లు క్లబ్ ఫౌండర్ అబ్దుల్‌నబీ తెలిపారు. అండర్ 6 బాలుర కటాస్ విభాగంలో సాజ్‌అలీ, సాద్‌అలీ, అయాన్‌రెడ్డి వెండి పతకాలు, అండర్ 10 విభాగంలో లోకేష్, అక్షిత, అశ్వని, ముష్రాఫ్, వేణుప్రసాద్ బంగారు పతకాలు, అండర్ 12 విభాగంలో వైష్విక్‌తేజ, వేణు, నవ్య, నందన్, భానుప్రకాష్, సోహెల్, విజయ్‌కుమార్, దుర్గాప్రసాద్, ఎండీ హర్షద్, ఆర్.తరుణ్ బంగారు పథకాలు, రుమాన్, జయంత్‌రెడ్డి వెండి పతకాలు, అండర్ 7 కుమ్మితే విభాగంలో వెంకట్రావు బంగారు పతకం, అండర్ 9 బాలికల విభాగంలో యోగేశ్వరి, అన్విత బంగారు పతకాలు, అండర్ 10 విభాగంలో రిత్విక్‌గౌడ్ బంగారు పతకం, అండర్ 12 విభాగంలో రాఘవేంద్ర బంగారు పతకం సాధించడంతో పాటు ఓరల్ గ్రాండ్ చాంపియన్‌షిప్ సాధించారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన సీనియర్ కరాటే మాస్టర్లు జాఫర్‌సాధిక్, హరీశ్‌యాదవ్, ఎండీ ఇంతియాజ్‌ను పలువురు అభినందించారు.

తిరుమలయ్యగుట్టను పర్యాటక కేంద్రంగా మార్చాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పెబ్బేరు రూరల్: వనపర్తి జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న తిరుమలయ్య గుట్టను ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము ఆధ్వర్యంలో నాయకులు సోమవారం కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రం సమీపంలో 200 ఏళ్ల చరిత్ర కలిగిన పురాత ఆలయం తిరుమలయ్య గుట్టపై వెలిసిన తిరుమలనాథ స్వామి దర్శించుకునేందుకు ప్రతి శ్రావణమాసంలో వేలాదిగా భక్తులు తరలివస్తారని వివరించారు. గుట్టపై ప్రజల సౌకర్యార్థం పార్కు, కల్యాణమండపం నిర్మిస్తే చక్కటి ఆహ్లాదకర వాతావరణంలో వివాహాలు, శుభకార్యాలు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సుమిత్రమ్మ, బాబురావు, స్వామి, జ్ఞానేశ్వర్, రాయన్న సాగర్, రఘు, నరేష్, పవన్, ఓంప్రకాష్‌చారి, రాములు, బోయ రామ్మోహన్, గోవిందు, మధు తదితరులు పాల్గొన్నారు.

సారూ.. ఈ అడ్డు ఎందుకు?

కొత్తకోట రూరల్: ప్రజల అవసరాల నిమిత్తం మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాలు ఒకే చోట నిర్మించారు. ప్రజలు వివిధ అవసరాల నిమిత్తం రెండు కార్యాలయాలకు వస్తుంటారు. కానీ కొత్తకోట ఎంపీడీఓ కార్యాలయం వారు, ఇటు వారు అటు.. అటు వారు ఇటు రావాలంటే కార్యాలయం లోపలే చుట్టూ తిరిగి రావాలనే ఆంక్షలు పెట్టి కార్యాలయంలో చెడిపోయిన పాతసామాను, ఇరిగిపోయిన కుర్చీలు, టేబుళ్లను అడ్డంగా పెట్టారు. ఇదేంటని ప్రశ్నిస్తే సమాధానం చెప్పేవారు కరువయ్యారు. కార్యాలయాల నిర్మాణాలు జరిగేటప్పుడు రెండు కార్యాలయాల అధికారులు తమ కార్యాలయాన్ని వేరు వేరుగా కట్టాలని ఉన్నతాధికారులకు చెప్పొచ్చు కదా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. అంతే కాకుండా కార్యాలయం లోపలికి రావాలంటే ప్రధాన గేటు, పక్కన గల చిన్నగేటు ఎప్పుడు మూసే ఉంచుతారు. ఈ గేటును ఎంపీపీ, ఎంపీడీఓ కారు వచ్చినప్పుడు మాత్రమే తెరుస్తారు. మళ్లీ మూసేస్తారు. అవసరాల నిమిత్తం కార్యాలయానికి వచ్చే వారు కంపౌండ్‌కు చిన్న ద్వారం ఒకరు మాత్రమే వెళ్లే విధంగా ఉంచారు. కలెక్టర్ కార్యాలయంలో అన్ని శాఖలు ఒకే దగ్గర ఉండే విధంగా నిర్మాణం చేశారు. కొత్తకోట మండపరిషత్ కార్యాలయంలో మాత్రమే ఇలా ఉండటంతో అధికారుల తీరుపై పలువురు మండిపడుతున్నారు.



ఎంపీడీఓ కార్యాలయంలో అడ్డంగా వేసిన పాత సామగ్రి, కుర్చీలు, బెంచీలు



ఎంపీపీ కారు రావడంతో తెరుచుకున్న ప్రధాన గేటు